ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం



మంచిరెడ్డి అనంతరెడ్డిని సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

చంపాపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, చంపాపేట పీఎస్ హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో 2011 ఏప్రిల్ 9న సంఘం ఆవిర్భవించిందని, నాటి తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయులు ఉధృతంగా పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం యూనియన్ నాయకులు మంచిరెడ్డి అనంతరెడ్డి, గజ్జెల జనార్దన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారు గజ్జెల జనార్దన్‌రెడ్డి, అసోషియేట్ అధ్యక్షులు శ్రీనివాసరావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వికారబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీశైలం హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు రత్నాకర్‌రావు, లింగస్వామి, వెంకట చక్రపాణి, వెంకటేష్, చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అష్టలక్ష్మి దేవాలయ క్యాలెండర్ ఆవిష్కరణ

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అష్టలక్ష్మి దేవాలయం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ మంగళవారం కొత్తపేటలోని ఆలయ ప్రాంగణంలో జరిగింది. సుధాకర్ పైప్స్ సీఎండీ నిలా జయదేవ్ ముఖ్యఅతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సోమసురేష్, ఫౌండర్‌ఛైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్త, ప్రధానకార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, మాజీ ఛైర్మన్ మాడం సుధాకర్ గుప్త, ప్రధాన అర్చకులు మరిగంగ్రి రాఘవాచార్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, నాగమల్ల శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



శ్రీనల్లపోచమ్మ అమ్మవారికి వెండి కిరీటం అందజేస్తున్న భక్తులు

చంపాపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని భూపేష్‌గుప్తానగర్ కాలనీలోని నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌కు చెందిన భక్తులు భవాని, ప్రవీణ్‌గౌడ్‌లు వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆలయ చైర్మన్, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం ధర్మకర్త నారగోని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు వెంకటేష్ ముదిరాజ్, శంకరయ్య, మధు ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, ఎరుకల చిన్న మల్లేష్‌గౌడ్, రమేష్‌బాబు, ప్రమోద్ గౌడ్, భరత్‌గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం వద్ద భగవాన్ శ్రీసత్యసాయి సేవాసమితి కన్వీనర్ రామలింగారెడ్డి తదితరులు

హయత్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద భగవాన్ శ్రీసత్యసాయి సేవా ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా చిత్ర పటానికి సాయి భక్తులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామ లింగారెడ్డి కమిటీ సభ్యులతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కె.వెంకటాచారి, సత్యనారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, శంకర్, సూరి బాబు, మంజునాథ్, కవిత, జయశ్రీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బాటసారుల దాహార్తిని దృష్టిలో పెట్టుకుని కాలనీవాసులు ఏర్పాటు చేసే చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సహార ఎస్టేట్స్ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సహార రోడ్డులోని వివేకాందనంద మార్ట్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నీటిని ఎప్పుడూ వృథా చెయవద్దని, ప్రతి పౌరుడూ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు నూనె జ్ఞానేశ్వర్, మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్, రేణుకుంట రాఘవేంద్ర, జగత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

వనస్థలిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఐక్యమత్యంగా ఉండి కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ యశోధరనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మల్లేషం, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులు రఘురామ రెడ్డి, కిషన్, కోశాధికారి రామకృష్ణ, సహాయ కార్యదర్శులు వెంకటేశ్వర్‌రెడ్డి, విఠలేషం, లింగం గౌడ్, ప్రకాశ్‌గౌడ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, సలహాదారులు పాల్గొన్నారు. అనంతరం వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు.



చంద్ర రాజేశ్వర్‌రావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

రాజేశ్వర్‌రావుకు నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చంద్ర రాజేశ్వర్‌రావు వర్ధంతి కార్యక్రమాన్ని కుంట్లూర్ ఆర్‌ఎస్‌ఆర్ కాలనీలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టిన చంద్ర తన ఆస్తి వాటాను పేదలకు పంచిపెట్టిన మహనీయుడన్నారు. పేదరిక నిర్మూలన, సమసమాజ స్థాపన కోసం నిరంతరం కృషి చేశాడన్నారు. తెలంగాణ విముక్తి కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ వ్యవస్థాపకులుగా పోరాడి జైలు జీవితం గడిపిన గొప్ప నేత అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సైనికులుగా జనసేవాదళ్ అనే సంస్థను సీపీఐకి అనుబంధంగా నిర్మించారని గుర్తుకు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్‌నాయక్, వట్టి నవనీత, అరుణ, పుల్లయ్య, దేవమ్మ, శోభన్, వినోద్, యాదగిరి, రాఘవేంద్ర, రాజు, శివ, భాను, భాస్కర్, కవిత, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.


మద్యం మత్తులో దంపతులపై దాడి

కొత్తపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొందరు వ్యక్తులు దుర్భాషలాడుతూ దంపతులపై దాడిచేసిన సంఘటన మంగళవారం సాయంత్రం ఎల్బీనగర్ పీఎస్ పరిధి హస్తినాపురం, షిర్డీ సాయినగర్‌లో చోటు చేసుకుంది. షిర్డీ సాయినగర్‌లోని ఓ భవనం మొదటి అంతస్తులో పి.సైదాచారి, భారతి దంపతులు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో యాదయ్య, అరుణ దంపతులు ఉంటున్నారు. యాదయ్య స్నేహితులలో కలిసి మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో మద్యం తాగి అసభ్యపదజాలంతో కేకలు వేశారు. దీంతో ఇరుగుపొరుగు వారు అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం యాదయ్య, అరుణ దంపతులు, స్నేహితులు సైదాచారి ఇంట్లోకి చొరబడ్డారు. అడ్డుకునేందుకు యత్నించిన సైదాచారి భార్యపై దాడి చేసి అసభ్యపదజాలంతో దూషించారు. పక్కింట్లో ఉండే భరత్‌కుమార్‌కు చెందిన కంప్యూటర్‌ను ధ్వంసం చేశారు. భవనం ఆవరణ మందుబాబుల అరుపులు, కేకలతో దద్దరిల్లింది. భారతి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



సైదాబాద్ సరస్వతీ నగర్ శిశుమందిర్‌లో ఉగాది వేడుకలలో మాట్లాడుతున్న హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత



దిల్‌సుఖ్‌నగర్ సాయి సంస్థాన్‌లో బాబాకు పూజలు చేస్తున్న అభ్యర్థి పట్నం సునితామహేందర్‌రెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, సైదాబాద్, మలక్‌పేట, మాదన్నపేట, పరిసరాలలో మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధ లతో జరుపుకున్నారు. ఉదయాన్నే ద్వారాలకు మామిడి తోరణాలతో అలంకరించుకున్నారు. షడ్రుచులతో కూడిన పచ్చడి సేవించారు. ఉప్పరిగూడ రామాలయం, సైదాబాద్ కాలనీ రామాలయం, ఎస్‌బీహెచ్ బీ కాలనీ కోదండరామాలయం, మాతామైదాన్‌లో విజయదుర్గామాత ఆలయం, జీవనజ్యోతి సంఘంలోని శ్రీ జయదుర్గ ఆలయాలలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉప్పరిగూడ రామాలయంలో జరిగిన పంచాంగ శ్రవణంలో ఆలయ కమిటీ సభ్యులు సంపత్‌యాదవ్, నిరంజన్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, వీరేశ్‌యాదవ్, శ్రీనివాస్, ధన్‌రాజ్, ప్రమోద్, నవీన్, ప్రవీణ్, రాజ్‌పాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీసీతారామాంజనేయస్వామి



కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈవో ఎం.శ్రీనివాసశర్మ

బండ్లగూడ ఆనంద్‌నగర్‌లో..

వనస్థలిపురం: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర నూతన పంచాగాన్ని నాగోల్ డివిజన్ బండ్లగూడ ఆనంద్‌నగర్‌లోని సహాభవనంలో బ్రాహ్మణ పెద్దల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు, ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, ఆర్కే దేశ్‌ముఖ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మంత్రి సునీల్, జిల్లా సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్ కుమార్, కేవీఎల్ఎస్.మూర్తి, ఎస్‌డీ.శర్మ, కేవీఆర్ రావు, శివకుమార్, విజయ్ కుమార్, మంత్రి లీలా భాయి తదితరులు పాల్గొన్నారు.

స్నేహపురి కాలనీలో..

కొత్తపేట: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని శ్రీగోదా సమేత పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయం శ్రీనివాస కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం క్రోధి నామ ఉగాది పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక ప్రవచన కర్త డా.కాకునూరి సూర్యనారాయణ మూర్తి పంచాంగ శ్రవణంలో రాశి ఫలాలు వివరించారు.

కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో ..

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీహనుమాన్ దేవస్థానంలో ఉగాది పంచాంగ శ్రవణంను నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు చంద్రకాంత్‌శర్మ, భార్గవశర్మ, శంకరశర్మ, శ్రవణ్‌కుమార్‌శర్మలు భక్తులకు ఉగాది పంచాంగ శ్రవణంను చదివి వినిపించారు. ఆలయ చైర్మన్ నల్లరఘుమారెడ్డి, ఈవో ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు, భక్తులు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి భక్తులు ఆలయంలో పెద్దఎత్తున పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్‌లో ..

అబ్దుల్లాపూర్‌మెట్: ఉగాది వేడుకలను అబ్దుల్లాపూర్‌మెట్ మండల, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

హయత్‌నగర్, తుర్కయంజాల్‌లో..

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలలో ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాల వద్ద పంచాంగ శ్రవణాన్ని పఠించి ప్రజలకు వివరించారు. హయత్‌నగర్‌లోని అయ్యప్ప ఆలయం వద్ద సాయంత్రం 6.30 గంటలకు పంచాంగ శ్రవణం చేశారు. ప్రజలు తమ రాశి ఫలాలను కూడా తెలుసుకున్నారు. ఉగాదిని పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి.

మలక్‌పేట పరిసర ప్రాంతాలలో..

చాదర్‌ఘాట్: మలక్‌పేట పరిసరప్రాంత ప్రజలు మంగళవారం ఆనందోత్సవాలతో ఉగాది పండుగను జరుపుకున్నారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి తయారు చేసి ప్రత్యేక పూజలనంతరం కుటుంబీకులు సేవించారు. తెలుగు సంవత్సరాది ఉగాది నుంచి అంత మంచే జరగాలని కోరుతూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- దిల్‌సుఖ్‌నగర్: మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునితామహేందర్‌రెడ్డి ఉగాది పర్వదినం సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్ సాయి సంస్థాన్‌లో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఎస్వీ కృష్ణప్రసాద్, బద్దుల వెంకటేష్‌యాదవ్, ప్రేమ్‌నాథ్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు బద్దుల వేణుయాదవ్, కె.శశిధర్‌రెడ్డి, ఏనుగు సుధీర్‌రెడ్డి, సత్యనారాయణ, సురేందర్‌రెడ్డి, శశికళ, సునిల్‌బాబు, వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రామాలయంలో పంచాగం శ్రవణంలో శ్రీరామ భక్త సమాజం ప్రతినిధులు



దిల్‌సుఖ్‌నగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో పంచాగ శ్రవణం

శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

చాదర్‌ఘాట్: దిల్‌సుఖ్‌నగర్ భవానీనగర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీసంతోషిమాత దేవాలయంలో శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలను మంగళవారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈసారి కూడా ఉగాది పర్వదినం నుంచి శ్రీరామనవమి వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం శ్రీసీత, లక్ష్మణ, ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రస్వామికి అభిషేకాలు నిర్వహించగా ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకోడానికి ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఉగాది సందర్భంగా షడ్రుచులతో కూడిన పచ్చడి పంపిణీ చేశారు.

ఆలయంలో నిద్రించే స్థలం కోసం గొడవ

ఘర్షణలో ఒకరి మృతి



కామ్‌సింగ్ మృతదేహం

పహాడి షరీఫ్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ కాలనీలోని పోచమ్మ ఆలయంలో నిద్రించే స్థలం కోసం జరిగిన గొడవలో ఓ వ్యక్తి మరణించాడు. మహారాష్ట్రకు చెందిన కామ్‌సింగ్ కూలి పనిచేస్తుంటాడు. సోమవారం అర్ధరాత్రి శ్రీరామ్ కాలనీలోని పోచమ్మ ఆలయం వద్ద నిద్రపోతున్నాడు. అదే కాలనీకి చెందిన కూలి పనులు చేసే నేనావత్ రోజూ రాత్రి సమయంలో పోచమ్మ ఆలయంలో నిద్రపోతాడు. తాను నిద్రపోయే స్థలంలో సోమవారం రాత్రి కామ్‌సింగ్ పడుకోవడంతో ఆగ్రహం చెందాడు. అక్కడినుంచి వెళ్లిపోవాలని కోరాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపంతో నేనావత్ పక్కన ఉన్న కర్ర తీసుకొని కామ్‌సింగ్ తలపై కొట్టాడు. తీవ్రగాయం కావడంతో కామ్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పహాడిషరీఫ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై భాస్కర్ తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

సైదాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ముగ్గురు యువకులు ఆలయంలో ప్రవేశించి, 50 కిలోల బరువు గల హుండీని ఎత్తుకుని పారిపోయారు. ఈ ఘటన సోమవారం రాత్రి ఇంద్రప్రస్థ కాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో జరిగింది. మంగళవారం తెల్లవారుజామున ఆలయ సిబ్బంది వచ్చి చూడగా హుండీ కనిపించలేదు. దీంతో పోలీసులకు తెలిపారు. హుండీ విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ఆలయ కమిటీప్రతినిధులు పేర్కొన్నారు. మరో చిన్న హుండీ చోరీకి యత్నించగా రాలేదు. దీంతో ఆగంతకులు వెనుదిరిగినట్లు వివరించారు. సైదాబాద్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గొడవ వద్దన్నందుకు హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి

సైదాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తండ్రీ కొడుకులు గొడవ పడుతుండగా వద్దని వారించినందుకు డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌పై కొడుకు దాడి చేశాడు. సోమవారం ఉదయం జరిగిన ఈ ఘటనపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాధవనగర్‌లో తండ్రీకొడుకులు కోటప్ప, వరుణ్ గొడవపడుతున్నారని సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, ఇతర సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. ఇద్దరికి సర్దిచెప్పేందుకు యత్నించగా హెడ్‌కానిస్టేబుల్‌ను వరుణ్ దుర్భాషాలాడుతూ దాడిచేశాడు. ఈ ఘటనపై సైదాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14న మహనీయుల జయంతి ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలతోపాటు బాబు జగ్జీవన్ రావ్, జ్యోతిరావు ఫూలే జయంతి ఉత్సవాలను ఈనెల 14వ తేదీన ముసారాంబాగ్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలంగాణ సోషల్ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరేళ్ల మహేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్‌ను రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా మంగవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఆర్.కృష్ణయ్య ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గ్రేటర్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు యశ్వంత్, సతీష్‌లాల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు ప్రస్తావనలేదే..

చిన్నచెరువు సంగతేంటి?

ప్రభుత్వ ఆదేశాలతో ఆగమేఘాల మీద కదిలిన ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు అక్కడక్కడ చెరువులు, కుంటలను సర్వే చేసి మమా అనిపించారు. హైదరాబాద్ శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో సుమారు 151 చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు ఉన్నాయి. ఇక్కడ కూడా క్షేత్ర స్థాయిలో చెరువుల సర్వే జరుగలేదు. రెండు, మూడు చెరువులను మాత్రమే సర్వే చేసిన ఆయా శాఖల అధికారులు...నేటికీ వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను మాత్రం ఏర్పాటు చేయకపోవడం ఆశ్చర్యమేస్తోంది. హద్దుల ఏర్పాటులో ఆయా శాఖల సమన్వయలోపం కొట్టొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం చేపట్టిన చెరువు, కుంటల సర్వే మునాళ్ల ముచ్చటగా మిగిలిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- చెరువుల సర్వే మూనాళ్ల ముచ్చటేనా...
- ఒకటి రెండు చెరువుల సర్వే చేసి మమా అనిపించిన ఇరిగేషన్ యంత్రాంగం
- సర్వే చేసిన చెరువులకు హద్దుల నిర్మాణంలో అదే నిర్లక్ష్యం
- కుంట్లూర్ చిన్నచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోనే రోడ్డు, లేఅవుట్ ఏర్పాటు



కుంట్లూర్ చిన్న చెరువులో నుంచి వేసిన రోడ్డు, ఎఫ్‌టీఎల్ బఫర్ పరిధిని ఆనుకుని లేఅవుట్



కుంట్లూర్ పెద్ద చెరువు సర్వే చేస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో ఆయా శాఖల అధికారులు ఉరుకుల పరుగులతో చెరువుల సర్వే పనులను చేపట్టారు. ఒక వారం, పది రోజులు సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఇరిగేషన్, అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ, పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధికారులు కుంట్లూర్ పెద్ద చెరువుతో పాటు తట్టిఅన్నారంలోని ఊరచెరువు, మరో రెండు కుంటలను సర్వే చేశారు. అయితే సర్వే చేసిన అధికారులు నేటికీ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో పక్కగా దిమ్మెళ్లను మాత్రం నిర్మించలేదు. తూతూ మంత్రంగా సర్వే చేసి అధికారులు చేతులు దులుపుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అయా శాఖల అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

కళ్ల ముందు ఆక్రమణ కనిపిస్తున్నా..

కుంట్లూర్ పెద్దచెరువు సర్వే చేసిన అధికారులు పక్కనే ఉన్న చిన్నచెరువు జోలికి మాత్రం వెళ్లలేదు. కుంట్లూర్ సర్వే నంబర్‌లో 176/1లో సుమారు 2 ఎకరాల్లో చిన్న చెరువు విస్తరించి ఉంది. గతంలో చెరువుకు ఎఫ్‌టీఎల్, బఫర్ హద్దులు ఉండగా కాలక్రమేనా అవి కనిపించకుండాపోయాయి. ఇటీవలే చెరువును అనుకుని ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో చెరువు స్థలం కూడా ఆక్రమణకు గురైందని పలువురు గ్రామస్తులు జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు ఎకరాల్లో ఉండాల్సిన చెరువు కేవలం ఎకరాకే పరిమితం అయినట్లు తెలుస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో చెరువు భూమిలో నుంచే సుమారు 40 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేశారు. కళ్ల ముందే చెరువు కబ్జాకు గురైనట్లు కనిపిస్తున్నా ఇరిగేషన్ అధికారులు చిన్న చెరువును సర్వే చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చిన్న చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లోనే లేఅవుట్ నిర్మాణం జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో చిన్న చెరువు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చిన్న చెరువు సర్వే చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆక్రమణకు గురైనా చెరువు విస్తీర్ణంను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.